ప్రజాశక్తి
గురువారం 21 ఆగస్టు 2025 5
శ్రీ సత్యసాయి

వినియోగదారులకు సంతృప్తికర సేవలు

ఎస్పీడీసీఎల్ సిఎండి సంతోష్ రావు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

విద్యుత్ వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలు అందించడమే తమ లక్ష్యమని ఎస్పీడీసీఎల్ సిఎండి సంతోష్ రావు పేర్కొన్నారు. వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిరంతరాయముగా అందించాలనే సంకల్పంతో సంస్థ అధికారులు, సిబ్బంది పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం స్థానికంగా జరిగిన సమావేశంలోఎ ఆయనతో పాటు సిజిఎంఒఎం డిఎస్ వరకుమార్, ఎస్ఇ సంపత్ కుమార్ , పుట్టపర్తి ఈ ఈ శివరాం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ వినియోగదారులకు సంతప్తి కరమైన సేవలు అందిచడమే ప్రధాన కర్తవ్యంగా సిబ్బంది పనిచేయాలని కోరారు. పి ఎం సూర్య ఘర్ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో పారిశ్రామికరణకు స్వీకారం చుట్టామని, ఇందులో భాగంగా జిల్లా లో ఆర్ డి ఆర్ ఎస్ ఎస్ 222 ఫీడర్లకు రూ.500 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టామని, పనులు వేగంగా జరుగుతున్నాయని సీఎండీ వివరించారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు

కదిరిలో గంజాయి కలకలం..!

శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో గంజాయి కలకలం రేగింది. భారీ స్థాయిలో పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. రెండు రోజుల క్రితమే గంజాయి బ్యాచ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇందులో ఓ జాతీయ పార్టీకి చెందిన నాయకుని కుమారులు ఉండడంతో వారిని కేసు నుంచి తప్పించేందుకు పోలీసులు వివరాలు బయటపెట్టకుండా కాలయాపన చేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

- పోలీసుల అదుపులో గంజాయి బ్యాచ్.?
- భారీగా స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం
- పట్టుబడిన వారిలో జాతీయపార్టీ నేత కుమారులు
- వారిని తప్పించేందుకే వివరాల వెల్లడిలో గోప్యత.?

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి రూరల్ మండలం కొండమనాయుని పాలెంలోని ఓ ఇంటిలో పెద్దమొత్తంలో గంజాయి నిల్వలను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గంజాయి సమాచారం అందుకున్న పోలీసులు ఆ గ్రామానికి వెళ్లి గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. పట్టుబడిన గంజాయి గ్యాంగ్‌లో ఓ జాతీయ పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకుల పిల్లలు ఉన్నట్లు సమాచారం. దీంతో ఆ జాతీయ పార్టీకి చెందిన నాయకులు అప్రమత్తమై ఆ పార్టీ పెద్దలను రంగంలోకి దింపి వారి పిల్లలను కేసు నుంచి తప్పించేలా పోలీసులపై ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది.

అరెస్టు వివరాల వెల్లడిపై గోప్యత

పోలీసులు గంజాయి బ్యాచ్‌ను అరెస్ట్ చేసి రెండు రోజులు కావస్తున్నా అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించడంలో గోప్యత కొనసాగుతోంది. రెండు రోజులు అవుతున్నా ఇంకా వివరాలను ఎందుకు వెల్లడించడం లేదన్న దానిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గంజాయి బ్యాచ్‌లో జాతీయ పార్టీ నాయకుని కుమారులతో పాటు కదిరి పట్టణానికి చెందిన హోటల్ నిర్వాహకుడి ప్రమేయం ఉండటంతో వారి పేర్లు బయటకు రాకుండా ఉండేందుకు కావాలనే ఆలస్యం చేస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి.

గతంలో స్వాధీనం చేసుకున్న గంజాయి (ఫైల్ ఫొటో)

యువతకు గంజాయి మత్తు

కొందరు యువకులు, విద్యార్థులు గంజాయికి అలవాటు పడి ఆ మత్తుకు బానిసలు అవుతున్నారు. అక్రమ సంపాదనకు అలవాటు పడిన కొందరు గంజాయిని ఇతర ప్రాంతాల నుంచి తెప్పించి కదిరి పట్టణం, సమీప ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. యువత, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని కళాశాలలు, విద్యాసంస్థల వద్ద గంజాయి గ్యాంగ్ ఈ విక్రయాలు చేస్తున్నారు. తక్కువ సమయంలో కోటీశ్వరుల కావాలన్న ఉద్దేశంతో కొందరు యువతకు గంజాయి మత్తును ఎక్కించి వారి జీవితాలను నాశనం చేస్తున్నారు. కదిరి ప్రాంతంలో గంజాయి ఉండరాదని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆదేశాలు ఇస్తున్నా అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు ఆ దిశగా అడుగులు వేయడం లేదనే విమర్శలు ఉన్నాయి. గంజాయి సరఫరాదారులు, విక్రేతలకు ఇంటి దొంగలే సహకరిస్తున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. ఇటీవల పట్టణ నడిబొడ్డున పోలీసులు గంజాయి సరఫరా చేస్తున్న వాహనాన్ని పట్టుకుని వదిలేసినట్లు విశ్వసనీయ సమాచారం. గతంలోనూ కొత్త బైపాస్ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న వారిని పట్టణ పోలీసులు పట్టుకుని వారి నుంచి మామూళ్లు తీసుకుని వదిలేసినట్లు తెలుస్తోంది.

గంజాయి బ్యాచ్ ఆగడాలు

గంజాయి సేవించిన యువకులు ఇతరులపై దాడులు చేస్తున్న ఘటనలూ తరుచూ కదిరి ప్రాంతంలో వెలుగు చూస్తున్నాయి. ఇటీవల కదిరి రూరల్ మండలం కాళసముద్రం గ్రామంలో గంజాయి సేవించిన గ్యాంగ్ అదే గ్రామానికి చెందిన విద్యార్థులను చింతబర్రలతో ఇష్టానుసారం చితకబాదారు. ఈ ఘటనపై ఆ గ్రామస్తులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన కూడా తెలిపారు. తమపిల్లలుపై దాడికి పాల్పడిన గంజాయి గ్యాంగ్‌పై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గంజాయి పై ప్రత్యేక నిఘా ఉంచాం

కదిరి డివిజన్ లో గంజాయి పట్ల ప్రత్యేక నిఘా ఉంచాం. గంజాయి సరఫరా, విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి విక్రయాలు, సరఫరాపై పక్కా సమాచారం అందితే అలాంటి వారిని వదిలిపెట్టే ప్రసక్తిలేదు. అలాంటి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం. డివిజన్‌లో గంజాయి విక్రయాల పట్ల తెలిస్తే సమాచారం అందించండి. సమాచారం ఇచ్చిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతాంస

శివనారాయణ స్వామి,
డీఎస్పీ కదిరి

సమస్యలుంటే ఫిర్యాదు చేయండి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్

ప్రజాశక్తి-హిందూపురం

ఉపకారాగారాల్లో ఉంటున్న నిందితులకు అర్హత ఉంటే ఖచ్చితంగా ఉచిత న్యాయ సహాయం అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఉపకారాగారాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి నిందితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని నిందితులు దరఖాస్తు చేసుకుంటే 48 గంటల్లోపు ఉచిత న్యాయ సహాయం కింద న్యాయవాదులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇందుకోసం ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. ఎంతమంది దరఖాస్తు చేసుకున్నా వారందరికీ అర్హతను బట్టి న్యాయవాదులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఉపకారాగారంలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపకారాగారాధికారి హనుమన్న, న్యాయవాది నవేరా, లోక్ ఆదాలత్ సిబ్బంది హేమావతి, పారా లీగల్ వాలంటీర్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

20 రోజుల తర్వాత స్వగ్రామానికి మృతదేహం

ప్రజాశక్తి - తనకల్లు

కుటుంబపోషణ నిమిత్తం గల్ఫ్‌దేశాల్లో ఒకరైన ఖతర్‌కు వెళ్లిన మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో నివసించే నూర్ మహమ్మద్(37) గత నెల 31న మృతిచెందాడు. అతని మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరుకుంది. ఈసందర్భంగా మృతుని కుటుంసభ్యులు మాట్లాడుతూ కుటుంబపోషణ నిమిత్తం ఖతర్ దేశానికి వెళ్లిన నూర్ మహ్మద్ గత నెల 31న మృతిచెందినట్లు సమాచారమందిందన్నారు. అయితే నూర్‌మహ్మద్ మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించడంలో నూర్‌మహ్మద్ పనిచేసే యజమాని నిర్లక్ష్యం వహించాడన్నారు. దీంతో తమ సమస్యను స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫోన్ ద్వారా సమాచారం అందించి అక్కడి నుండి భారత ఎంబసీకి సమాచారం అందించి గల్ఫ్ దేశాలలో నివసిస్తున్న భారతీయులను కూడా అప్రమత్తం చేసి మృతదేహం భారతదేశానికి రప్పించడానికి తన వంతు ప్రయత్నం చేశారన్నారు. ఎమ్మెల్యే చొరవ వలన తమ బిడ్డ ను కడసారి చూసుకున్నామని మృతుని తల్లిదండ్రులు అన్నారు. ఈ సందర్భంగా తనకల్లు మైనార్టీ సభ్యులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

స్కూలు డైరీలు అందుకున్న విద్యార్థులతో ట్రస్ట్ సభ్యులు

విద్యార్థులకు స్కూల్ డైరీలు పంపిణీ

ప్రజాశక్తి-పెనుకొండ

ఎస్ ఆర్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ డైరీలను బుధవారం పంపిణీ చేశారు. పట్టణంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 8,9,10వ తరగతి చదివే విద్యార్థులందరికి డైరీలు అందించారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షులు శ్రీరాములు మాట్లాడుతూ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్, రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత ట్రస్ట్ ద్వారాపెనుకొండ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో 10వేల డైరీలను విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారన్నారు.. ఈ కార్యక్రమంలో గర్ల్ హై స్కూల్ హెచ్ఎం శ్రీలత , ప్రధానోపాధ్యాయులు రామచంద్ర, ట్రస్ట్ సభ్యులు రామాంజనేయులు, బాబుల్ రెడ్డి, పట్టణ మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

ప్రజాశక్తి - గుడిబండ

గుడిబండ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె గ్రంథాలయంలోని పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు గుడిబండ గ్రంథాలయ శాఖ అధికా ఇబ్రహీం తెలిపారు. గ్రంథాలయానికి రావలసిన బకాయిల గురించి గుడిబండ ఈవోఆర్డీతో చర్చించారు. అలాగే పాఠకుల సంఖ్య పెంచాలని గ్రంథాలయ అధికారి ఇబ్రహీంకు సూచించారు.

అర్హత ఉన్నా పింఛను తొలగిస్తామనడం అన్యాయం

అధికారులను ప్రశ్నించిన బాధితులు, నాయకులు

పక్షపాతంతో బాధపడుతున్న గంగమ్మను ఎంపిడిఒకు చూపిస్తున్న దృశ్యం

తమ సమస్యను మున్సిపల్ ఛైర్మన్‌కు విన్నవిస్తున్న బాధితులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంతోపాటు రూరల్ మండల వ్యాప్తంగా పింఛన్ల రద్దు జాబితాలో పేర్లు ఉన్న వికలాంగులు మండల పరిషత్ కార్యాలయం, మునిసిపల్ కార్యాలయలకు పరుగులు పెడుతున్నారు. రూరల్ మండలం మణుగూరు గ్రామానికి చెందిన గంగమ్మ పక్షవాతంతో బాధపడుతూ మంచానికి పడింది. ఆమె పేరు పింఛను రద్దు జాబితాలో ఉంది. దీంతో బంధువులు ఆమెను ఎత్తుకొని ఎంపిడిఒ సరస్వతి ముందు ఆమెని చూపిస్తూ, ఈమెకు పింఛను రద్దు చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. గత కొన్ని సంవత్సరాలుగా రూ 15,000 పింఛను వచ్చేదని, ఈ డబ్బుతో గంగమ్మకు అవసరమైన మందులను కొనుగోలు చేసి ఇచ్చేవారని అన్నారు. మరో ఇద్దరు వికలాంగులు వారు వాడే వీల్ చైర్లతో వచ్చి తమ పేర్లు పింఛను రద్దు జాబితాలో ఉన్నాయనిఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా పురపాలక సంఘ వ్యాప్తంగా పెన్షన్ రద్దు అయిన వికలాంగులు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి చైర్మన్ రమేష్ కుమార్, కమిషనర్ మల్లికార్జున ముందు వారికి జరిగిన అన్యాయంపై ఆందోళన వ్యక్తం చేస్తూ మొరపెట్టుకున్నారు. ఆయా కార్యాలయాల్లో తమకు పింఛన్లు పునరుద్దించాలని వినతులను అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ రమేష్ కుమార్ ఈ విషయంపై ఉన్నతాధికారులతో ఫోన్‌లో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నుంచి వికలాంగుల పింఛన్ల విషయంలో అర్హులకు అన్యాయం జరిగిందని కొందరు నకిలీ సదరం సర్టిఫికెట్లతో పింఛన్లు పొందుతున్నారని అన్నారు. ఏ ఒక్కరు కూడా అధైర్య పడాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికి రీ వెరిఫికేషన్ చేసి పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

సోమందేపల్లి : మండలంలో పింఛను తొలగింపు దారుల జాబితా వెలువడటంతో బాధితులు ఆందోళనకు గురవుతున్నారు. తమకు న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటున్నారు. బుధవారం మండలకేంద్రంలో ఎంపిడిఒ కార్యాలయానికి ఆయా గ్రామాలకు చెందిన పింఛను తొలగింపు దారులు వచ్చారు. మండల వ్యాప్తంగా 14 సచివాలయాలు ఉండగా అన్ని సచివాలయాలకు కలిపి సుమారు 126 మంది వికలాంగులను పింఛను జాబితా నుంచి తొలగించినట్లు అధికారుల సమాచారం. దీంతో మండలంలోని మారుమూల గ్రామాల ప్రజలు సంబంధిత సచివాలయానికి వెళ్లగా అక్కడ ఉన్న సచివాలయ సిబ్బంది సలహాతో అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి మండల అభివృద్ధి అధికారి కార్యాలయానికి అర్జీలతో వస్తున్నారు. గతంలో పూర్తిగా వైద్యుల సమక్షంలోనే సర్టిఫికెట్లు జారీ చేసి అర్హులుగా పరిగణించి దాదాపు పది సంవత్సరాలుగా పింఛన్ అందిస్తున్నారని అయితే ఇప్పుడు అనర్హత ఎలా వస్తుందని వారు ప్రశ్నిస్తున్నారు. అనర్హులను తొలగిస్తామన్న ప్రభుత్వం పలువురు అర్హత గల వికలాంగులను తొలగించిందని వాపోయారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపిడిఒ వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఇది తొలగింపు కాదని వెరిఫికేషన్ మాత్రమే నని అన్నారు. ప్రస్తుతం మండలంలో 126 మంది వికలాంగులకు సంబంధించిన వెరిఫికేషన్ లిస్ట్ వెలువరించినట్లు చెప్పారు. ఈ జాబితాలో గల వారు వారి వద్ద నున్న సర్టిఫికెట్లను మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేస్తే అవన్నీ రీ వెరిఫికేషన్ కింద ఎంపీడీవో లాగిన్ లో అప్లోడ్ చేయడం జరుగుతుందని చెప్పారు. అనంతరం వీరందరికీ హిందూపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వెరిఫికేషన్ కోసం ఒక తేదీని ప్రభుత్వం ప్రకటించడం జరుగుతుందని అన్నారు. అప్పుడు వైద్యుల సమక్షంలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేస్తారని వైద్యులు వారి వైకల్యాన్ని నిర్ధారణ చేయడం జరుగుతుందని అన్నారు. అర్హులు ఎవరికి అన్యాయం జరగదని వివరించారు.

పెనుకొండ : అర్హులైన వికలాంగులకు పింఛన్లను పునరుద్ధరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు హరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో 193 వికలాంగుల పింఛన్లను తొలగించిన నేపథ్యంలో సిపిఎం ఆధ్వర్యంలో బాధితులతో కలసి స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. అనంతరం ఎంపీడీవో నరేష్‌కృష్ణ తో చర్చించారు. ఈ సందర్భంగా హరితో పాటు సిఐటియు మండల కన్వీనర్ బాబావలి మాట్లాడుతూ ప్రభుత్వం అనర్హులను తొలగించి అర్హులైన వారికి తిరిగి పరీక్షలు నిర్వహించాలన్నారు. పుట్టుకతో వికలత్వం ఉన్నవారి పింఛను తొలగించారని అలాంటి వారికి వెంటనే పింఛను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎంపిడిఒ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలోని బాధిత వికలాంగులు పాల్గొన్నారు.

గుడిబండ : అర్హులైన వికలాంగుల పింఛన్లు రద్దు చేయడం దారుణహని వైసిపి మండల నాయకులు గుడిబండ సర్పంచ్ జీబీ కరుణాకర్, అశ్వర్థనారాయణ, యంజేరగౌడ్, గిరి, రామచంద్ర అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని ఎస్ రాయపురం గ్రామానికి చెందిన దాదాపుగా 12 మంది అర్హులైనవికలాంగులకు గతంలో వస్తున్న పింఛన్లను రద్దు చేయడానికి పూనుకోవటం అన్యాయమన్నారు. దీంతోపాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దాదాపు 350 మంది కి పైగా వికలాంగుల పింఛన్లు రద్దు చేసేందుకు సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేశారన్నారు. ప్రభుత్వ తీరువల్ల అర్హులైన వికలాంగులకు అన్యాయం జరుగుతోందని వాపోయారు. పేదల సంక్షేమం కోసమే కూటమి ప్రభుత్వం పని చేస్తుందని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు అర్హులైన వికలాంగుల పింఛన్లు తొలగించడం అన్యాయమన్నారు. రద్దు చేసిన పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు వికలాంగులతో కలిసి డిప్యూటీ ఎంపీడీవో నాగరాజు నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో హనుమంతరాయప్ప, వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు వికలాంగులు పాల్గొన్నారు.

పెనుకొండ ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసనలో వికలాంగులు, నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న వాకాటి అరుణ

మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దండి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

మహిళలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని సెర్ప్, ఎక్స్ అఫీషియో కార్యదర్శి వాకాటి కరుణ పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి పట్టణంలోని స్థానిక గణేష్ సర్కిల్‌లో ఉన్న షాదీ మహల్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లాల వెలుగు, సెర్ప్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాలు ఆర్థిక సాధికారిక సాధించేందుకు అన్ని రకాల రుణ సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పిఎంఎఫ్ఎంఎ, పిఎంఈజీపి ద్వారా రుణ సహాయం అందించాలన్నారు. వెలుగు సిబ్బంది మహిళా సంఘాలతో మమేకం కావాలని వారి సమావేశాలకు కచ్చితంగా హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ ఉన్నతి హెచ్‌డి డైరెక్టర్ శివ శంకర ప్రసాద్, సత్యసాయి, అనంతపురం జిల్లాల డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్లు నరసయ్య, శైలజ, ఉమ్మడి జిల్లాల డిపిఎంలు, ఎపిఎంలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఎపి ఆర్ఎస్ ఎక్సలెన్స్ పాఠశాలలో విద్యార్థి ఆత్మహత్యాయత్నం

పరిగిలోని ఎపిఆర్ఎస్ ఎక్సలెన్స్ పాఠశాల

ఆలస్యంగా వెలుగులోకి..
ప్రశ్నించిన మీడియాపై ప్రిన్సిపల్ చిందులు

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని ఎపిఆర్ఎస్ ఎక్సలెన్స్ పాఠశాల విద్యార్థి ఆత్మహత్యాయత్నం ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈఘటనపై వివరాలు అడిగేందుకు వెళ్లిన విలేకరులపై పాఠశాల ప్రిన్సిపల్ చిందులు తొక్కారు. ఈఘటనకు సంబందించి పాఠశాల సిబ్బంది ద్వారా విశ్వసనీయంగా వెలుగులోకి వచ్చిన వివరాలు.. కంబదూరు మండలానికి చెందిన విద్యార్థి మహేష్ బాబు 2020 సంవత్సరంలో ఏపీ ఆర్ఎస్ ఎంట్రన్స్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి సీటు సంపాదించారు. గత నాలుగేళ్లుగా పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నాడు. చురుకుగా ఉన్న మహేష్ బాబు కొన్ని రోజులుగా పాఠశాలలో కలత చెందాడు. ఈ నేపథ్యంలో అనారోగ్యానికి గురి కావడంతో ఈనెల మూడవ తేదీన పాఠశాల నుండి తన సొంతూరు కంబదూరుకు వెళ్లారు. అయితే మహేష్‌బాబు తిరిగి పాఠశాలకు వెళ్లేందుకు సుముఖత చూపలేదు. విద్యార్థి పాఠశాలకు రాకపోవడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో తండ్రి ఈనెల 18వ తేదీన సోమవారం మధ్యాహ్నం పాఠశాలకు వచ్చిన మహేష్‌బాబు ప్రిన్సిపల్ ను కలిశారు. ఆ సమయంలో అక్కడే ఉన్న మరో ఉపాధ్యాయుడు విద్యార్థిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో కలత చెందిన విద్యార్థి పాఠశాలలో ఉన్న క్రిమిసంహారకమందు తీసుకుని పాఠశాల ప్రాంగణంలోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన ఉపాధ్యాయులు హుటాహుటిన మహేష్‌బాబును హిందూపురం ప్రభుత్వాసుపత్రికి ద్విచక్ర వాహనంలోనే తీసుకెళ్లారు. విద్యార్థికి ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పటికీ ఆసుపత్రిలో వైద్యం అందించే విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. అయితే పాఠశాల సిబ్బంది ద్వారా విషయం బయటకు రావడంతో మీడియా కవరేజ్ కి వెళ్ళిన రిపోర్టర్ల పై పాఠశాల ప్రిన్సిపల్ చిందులు తొక్కారు. సమాచారం ఇవ్వడంలో అనాసక్తి చూపడంతో ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నారు. విద్యార్థి తండ్రికి నచ్చజెప్పి విద్యార్థిని వారి గ్రామానికి పంపించి చేతులు దులుపుకునేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఈ విషయం పై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు కానీ ఉన్నత విద్యాశాఖ అధికారులకు కనీస సమాచారం లేకపోవడం పాఠశాల ప్రిన్సిపల్ పనితీరుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. విద్యార్థి ఆత్మహత్య యత్నానికి పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు దురుసు వైఖరేనన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ సంఘటనపై స్పందించి విచారణ చేయించాలని పలువురు కోరుతున్నారు.

సింగిల్ విండో అధ్యక్షులుగా రవిమోహన్

ప్రజాశక్తి గోరంట్ల

మండలంలోని గౌని వారి పల్లి సహకార సంఘం అధ్యక్షులుగా రవిమోహన్ బుధవారం సహకార సంఘం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సహకార సంఘం సిబ్బంది పాల్గొన్నారు

మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌కు సన్మానం : వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా ఎంపికైన తిరుపాల్ ను గోరంట్ల మైనార్టీ నాయకులు బుధవారం మండలంలోని గౌని వారి పల్లి గ్రామంలో సన్మానించారు భవిష్యత్తులో మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు అజ్మతుల్లా, డైరెక్టర్ నబి రసూల్, నాయకులు అమానుల్లా, రఫీక్, ఉస్మాన్ ఖాన్, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండల పరిధిలోని వెలిచెలమల, గౌకనపేట, వంకమద్ది, ధనియానిచెరువు, దిగువతూపల్లి గ్రామాలలో అంతర పంటలు సాగు చేస్తున్న రైతులకు ఏవో లోకేశ్వర్ రెడ్డి బుధవారం పలు సూచనలు చేశారు. అంతర పంటల సాగు వల్ల అధిక దిగుబడులు సాధ్యమని చెప్పారు. అంతరపంటల్లో చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు విజయకుమార్, చంద్రమోహన్ రెడ్డి, వేణుగోపాల్ లతో పాటు రైతు సేవా కేంద్ర సిబ్బంది కుమారి, రాధా తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ తనిఖీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌ని అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సలీం భాష బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న విద్య, పారిశుధ్యం, మౌలిక వసతులపై ఆరా తీశారు. ఉపాధ్యాయులతో సమావేశం జరిపి పలు సూచనలు ఇచ్చారు. విద్యార్థులతో మాట్లాడి విద్య సామర్థ్యాలను పరిశీలించారు.

కాలువ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

ముదిగుబ్బ మండలంలో వెళుతున్న హంద్రీనీవా కాలువ నుంచి చెరువులకు నీటిని నింపడానికి చేపట్టిన కాలువ పనులను టిడిపి నాయకులు, అధికారులు బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాలువ ద్వారా మండలంలోని పలుచెరువులను నీటితో నింపుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎన్ఎస్ఎస్ డిఇ ప్రసాద్ రావ్, ఎఇ షబానా, మైనర్ ఇరిగేషన్ ఎఇగురు ప్రసాద్‌చ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గంధం ఉత్సవం

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

పట్టణ సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న హజ్రత్ సయ్యద్ బెహలూల్ షా ఖాద్రీ స్వామి 828వ గంధం మహోత్సవం బుధవారం తెల్లవారుజామున పీఠాధిపతి షేక్షావలీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా లో స్వామి కి ప్రత్యేక ప్రార్థన లు నిర్వహించి గంధం సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులకు నిర్వాహకులు అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హిందూపురం మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, పెనుకొండ ఏజీపీ భాస్కర్ రెడ్డి, సోమందేపల్లి మాజీ వైస్ సర్పంచి కుళ్లాయప్ప, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

22న కదిరిలో మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

కదిరిలో ఈనెల 22న జాబ్ మేళా నిర్వహిస్తున్నామని నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 22వ తేదీన 9 గంటలకు కదిరిలోని ఎస్ టి ఎస్ ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 10 బహుళ జాతీయ కంపెనీలతో జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. జాబ్ మేళాకు పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిప్లమా, బీఫార్మసీ, ఎం ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, బీటెక్, పీజీ చదివి 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలు వయసు కలిగిన అభ్యర్థులు రావాలని సూచించారు. జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు రూ. 12 వేల నుంచి 30 వేల రూపాయల వరకు వేతనం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9390176421 కు ఫోన్ చేసి సంప్రదించవచ్చని అన్నారు.

సహకార సంఘం అధ్యక్షులుగా ఓబుల్ రెడ్డి

ప్రజాశక్తి - తలుపుల

తలుపుల మండలం సహకార పరపతి సంఘం అధ్యక్షులుగా నూతనకాలువ గొర్ల ఓబుళరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఓబుళరెడ్డి మాట్లాడుతూ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ ముబారక్, రామకృష్ణారెడ్డి, మేడ శంకర, జయచంద్ర, కొమ్మెర శీన, రాజా, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి - తాడిమర్రి

ఉత్తమ అధికారులుగా అవార్డులు పొందిన వారిని బుధవారం సన్మానించారు. మండల పరిధిలోని చిల్లవారి పల్లి సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ ప్రవల్లిక, ఎంపీడీవో రంగారావు, డిప్యూటీ ఎంపీడీవో విజయ్ శేఖర్ నాయుడును చిల్లవారి పల్లి గ్రామ సర్పంచి పరమేశ్వర్ రెడ్డి. గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నల్లచెరువు : స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉత్తమ ఫీల్డ్ అసిస్టెంట్ గా అవార్డు పొందిన నల్లచెరువు ఫీల్డ్ అసిస్టెంట్ నరేంద్రరావును ఎంపీడీవో రఘునాథ గుప్తా ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మంజునాథ్. ఈసీ సుబ్బారెడ్డి. టిఎలు రమేష్, మల్లికార్జున, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు

యూరియాపై రైతులు ఆందోళన చెందొద్దు : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలోని రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దని రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయడం జరుగుతుందని కలెక్టర్ టిఎస్ చేతన్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్లో వ్యవసాయ సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులు సాగు చేసుకునే పంటలకు అవసరమైన యూరియా లభ్యత గురించి సమీక్షించారు. బుధవారం వరకు జిల్లాలో 4700 టన్నులు యూరియా ఉందన్నారు. రైతులకు అవసరమైన యూరియా సరఫరా చేయడం జరుగుతుందని రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని అన్నారు. యూరియాను వ్యవసాయ సంబంధిత అవసరాలకు కాకుండా ఇతర పారిశ్రామిక అవసరాలకు మళ్లించినా, ఎరువుల డీలర్లు కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జేడీ సుబ్బారావు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, జిల్లా పౌరసరఫరాల అధికారి వంశీకృష్ణారెడ్డి, రవాణా శాఖ అధికారి ఉదయ్ కుమార్, కాలుష్య నివారణ అధికారి మహేష్, కార్మిక శాఖ కమిషనర్ సూర్యనారాయణ, పశుసంవర్ధక శాఖ అధికారి శుభదాస్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల పాట్లు

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని రైతులు యూరియా, తదితర ఎరువుల కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. యూరియా వస్తుందని సమాచారం రావడంతో బుధవారం స్థానికసొసైటీ గోడౌన్ వద్దకు మండలంలోని రైతులు, మహిళ రైతులు పెద్దసంఖ్యలో వచ్చారు. చివరికి యూరియా లోడ్ రావడంతో రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. ప్రస్తుతం రైతులు వరి నాట్లు, వేరుశెనగ, మొక్కజొన్న, రాగి తవ్వకాలు జరుగుతున్నాయి దీంతో ప్రస్తుతం రైతులకు రసాయన ఎరువులు అవసరం అధికంగా ఉంది. అయితే అవసరానికి తగ్గట్టుగా రసాయన ఎరువులు సొసైటీ, రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో లేకపోవడంతో రైతులు వచ్చిన లోడ్ అయిపోతుందనే అభద్రతాభావంతో సొసైటీ గోడౌన్ వద్ద గుంపులు గుంపులుగా ఎదురుచూస్తున్నారు.

యూరియా కోసం వేచి ఉన్న రైతులు

బయట ప్రైవేటు వ్యక్తుల వద్ద ఒక ప్యాకెట్‌కు రూ. 200 నుంచి 300 రూపాయలు అధికంగా వెచ్చించి కొనుగోలు చేయలేక సొసైటీ ఎరువుల కోసం ఎదురుచూస్తున్నామని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి అన్ని రైతు సేవా కేంద్రాల్లోనూ, సొసైటీలలోనూ అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవా రైతులు కోరుతున్నారు.

న్యాయం చేయండి

ప్రజాశక్తి - నల్లచెరువు

తనకు సంబంధించిన భూమికి చెందిన ఒరిజినల్ డాక్యుమెంట్లను ఓరువాయి గ్రామానికి చెందిన రైతు చిన్నరెడ్డప్ప బుధవారం స్థానిక డిప్యూటీ తహశీల్దార్ రవికుమార్‌కు సమర్పించారు. తనకు సంబంధించిన భూమిని తన దాయాది పేరుమీద ఆన్‌లైన్‌లో ఎక్కించారని ఆరోపిస్తూ ఓరువాయి గ్రామానికి చెందిన విఆర్ఎ రంగస్వామి మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన తెలిసిందే. ఈ నేపథ్యంలో విఆర్ఎ దాయాది అయిన చిన్నరెడ్డప్ప బుధవారం ఆ భూమి దానికి సంబంధించిన వర్జినల్ డాక్యుమెంట్లను టేషన్ డిప్యూటీ తహశీల్దార్ రవికుమార్‌కు సమర్పించారు. ఈ విషయంలో అధికారులు తమకు న్యాయం చేయాలంటూ కోరారు గతంలో వైసిపి ప్రభుత్వ హయాంలో వీఆర్ఏ రంగస్వామి తమకు రావలసిన భూమిని వారి పేరుమీద ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నాడని విమర్శించారు. అప్పుడు ఈ విషయమై లాయర్ల దగ్గరకు రాజకీయ నాయకుల దగ్గరకు వెళ్లిన ప్రయోజనం కనపడలేదన్నారు. ప్రస్తుతం విచారణ జరిపిన అధికారులు తన పేరుమీద 19 సెంట్ల స్థలాన్ని ఆన్‌లైన్‌లో ఎక్కించారన్నారు. ఈ విషయంపై సంబంధిత రెవెన్యూ సిబ్బంది విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని చిన్నరెడ్డప్పతో పాటు, రంగారెడ్డి తదితరులు కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న చిన్నరెడ్డప్ప

బలవంతపు భూసేకరణ ఆపాలి : ఎపి రైతుసంఘం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

నెల్లూరు జిల్లా కరేడు గ్రామంలో ఇండోసోల్ కార్పొరేట్ కంపెనీ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బలవంత భూసేకరణకు వెంటనే ఆపాలని ఎపి రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ధర్మవరంలోని సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సి పి ఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, చేనేత నాయకులు ఎస్ ఎచ్ బాషా మాట్లాడుతూ రైతుల సమ్మతి లేకుండా కార్పొరేట్ కంపెనీల కోసం రాష్ట్ర ప్రభుత్వం బలవంతంగా భూసేకరణ చేపట్టడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. అదేవిధంగా శ్రీ సత్య సాయి జిల్లాలో సోలార్ ఏపీఐఐసీ కోసం సుమారు 60 వేల ఎకరాలతో పాటు ఎన్ పి కుంట, హిందూపురం, మడకశిర, రొద్దం తదితర ప్రాంతాలలో బలవంత భూసేకరణ చేశారని దీనిని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జె వి రమణ, టి అయుబ్ ఖాన్, వి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో పాల్గొన్న నాయకులు

జిల్లా కేంద్రం మార్పు వదంతులపై ఎమ్మెల్యే స్పందించాలి : వైసిపి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రం మార్పుపై వస్తున్న వదంతులపై స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి స్పందించాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి డి.ఎస్ కేశవరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం వైసీపీ స్థానిక కార్యాలయంలో ఆ పార్టీ నాయకులతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పుట్టపర్తి కేంద్రంగా కాకుండా హిందూపురానికి మారుస్తున్నారని వదంతులు రావడంతో జిల్లాలో అందరిలోనూ అలజడి, ఆందోళన మొదలైందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి హయాంలో వచ్చిన జిల్లా కేంద్రాన్ని కేవలం హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ మెప్పు కోసం మార్పు చేస్తారన్న వదంతులు, ప్రచారాలు కొనసాగుతున్నాయన్నారు. హిందూపురానికి జిల్లా కేంద్రం తరలిస్తామంటే ఊరుకునేది లేదని ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ మార్పు వదంతులపై వస్తున్న ప్రచారాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి గాని, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి కానీ మాట్లాడకపోవడం దారుణం అన్నారు. అసలు ఎమ్మెల్యే బాలకృష్ణపై ఎదురు మాట్లాడే దమ్ము ఈ జిల్లాలో టిడిపి నాయకులకు ఎవరికైనా ఉందా? అని ప్రశ్నించారు. కోట్లాది భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రవర్తిస్తే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయమై ప్రభుత్వం లేదా ఎమ్మెల్యే కానీ ప్రజలకు సరైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం తరలిపోకుండా పార్టీలకు అతీతంగా పనిచేయాలని రాస్తారోకోలు ఆమరణ నిరాహార దీక్షలకు సైతం సిద్ధంగా ఉంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, పట్టణ కన్వీనర్ రవి నాయక్, నాయకులు ఈశ్వరయ్య, కేశప్ప, బుక్కపట్నం ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, అగ్రి బోర్డ్ మాజీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, కౌన్సిలర్లు పవన్ కుమార్, చెరువు భాస్కర్ రెడ్డి, బిల్డర్ మల్లికార్జున, రాష్ట్ర మహిళా నాయకురాలు సాయి లీలరెడ్డి, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో పాల్గొన్న వైసిపి నాయకులు

కూటమి ప్రభుత్వంలో ప్రజలకు అన్యాయం : వైసిపి

ప్రజాశక్తి - నల్లచెరువు

అబద్ధపు హామీలతో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని వైసిపి మండల కన్వీనర్ మండెం రవికుమార్ రెడ్డి విమర్శించారు. మండల పరిధిలోని తవలంమర్రి సర్పంచి అంజనమ్మ ఆధ్వర్యంలో గ్రామంలో బుధవారం నిర్వహించిన చంద్రబాబు ష్యూరిటి మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న మండెం రవికుమార్ రెడ్డి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. క్యూఆర్ కోడును స్కాన్ చేసి ప్రభుత్వ మోసాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ కన్వీనర్ సద్ద పల్లి రఫీ, మాజీ సర్పంచులు నరసింహారెడ్డి, ఎంపిటిసి రమణారెడ్డి, సీనియర్ నాయకులు పోరెడ్డి వెంకటరెడ్డి, , గోవిందరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న వైసిపి నాయకులు

గ్రామ సచివాలయాల్లో ఖాళీ కుర్చీలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు పంచాయతీ గ్రామ సచివాలయం 1లో అధికారులు అందుబాటులో లేక ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. కార్యాలయంలో అధికారుల నిర్లక్ష్యం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఉదయం 11 గంటలు దాటినా అధికారులు హాజరుకాకపోవడంతో సేవల కోసం వచ్చిన ప్రజలు చెట్టు నీడలో కూర్చొని పడిగాపులు కాశారు. అధికారులు తమ సమస్యలు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయం కార్యాలయంలో సిబ్బంది సమయానికి రాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. సిబ్బంది గైర్హాజరు కావడంతో అనేక సేవలు వచ్చే ప్రజలు చెట్ల కింద కూర్చుని పడిగాపులు కాసారు. సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

మాజీ మావోయిస్టుల స్థలాలు వారికే అప్పగించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న మాజీ మావోలు, సానుభూతిపరులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ధరణి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మాజీ మావోయిస్టులకు కేటాయించిన స్థలాలను వారికే అప్పచెప్పాలని ఆర్డీవో సువర్ణకు మాజీ మావోలు వినతి పత్రం అందజేశారు. బుధవారం పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం ముందు మాజీ మావోలు, వారి సానుభూతిపరులు నిరసన తెలియజేశారు. పుట్టపర్తి మండల పరిధిలోని కప్పల బండ పొలం సర్వేనెంబర్ 315-1 లో 4-88 ఎకరాలు భూమిని ఈ లక్ష్మమ్మతో ఏడున్నర లక్షల రూపాయలకు కొనుగోలు చేసి ఒక్కొక్కరికి రెండున్నర సెంట్లు భూమిని కేటాయించి లాటరీ పద్ధతిలో 125 ప్లాట్లను వేసి మాజీ మావోయిస్టులు, వారి సానుభూతిపరులు, కొంతమంది పేదలు కలిసి పంచుకున్నామన్నారు. అందులో రెండు బోర్లు వేసుకున్నామని ఒక కమ్యూనిటీ హాల్ నిర్మించుకున్నామని చెప్పారు. పట్టాల కోసం రెవెన్యూ వారిని విన్నవించామన్నారు. అందులో పలువురు 2013లోనే ఇళ్లను నిర్మించుకున్నామన్నారు. 2019 వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అప్పటి ఎమ్మెల్యే, నాయకులు లోచర్ల విజయభాస్కర్ రెడ్డి ఇద్దరు కలిసి ఆ కాలనీని కబ్జా చేసి ఒక్కొక్క ప్లాటు రూ. 5 లక్షలు, రూ. 10 లక్షలకు అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై తమ దగ్గర ఉన్న ఆధారాలతో కోర్టుకు వెళ్లామన్నారు. తహశీల్దార్, ఆర్డీవో, కలెక్టర్, ఎస్పీకి విషయం తెలియజేశామని చెప్పారు. అయితే ఆక్రమణకు గురైన కాలనీని తమకు అప్పజెప్పలేదని అన్నారు. గతంలో కూడా ఆర్డీవోకు ఇదే విషయాన్ని తెలియజేసామని చెప్పారు. నిర్మాణాలను అడ్డుకోవడానికి వెళ్లిన ఆర్డీవోను సైతం రాజకీయ అండతో ఆనాడు వెనక్కి పంపారని, అందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకుంటామని తెలిపినా, నేటికీ ఒక వర్గం అందులో నిర్మాణాలు చేపడుతోందని అన్నారు. ఈ సందర్భంగా వారి వద్ద ఉన్న ఆధారాలను ఆర్డీవో సువర్ణ చేతికి అందజేశారు. వీటిని పరిశీలించి చర్యలు తీసుకుంటారని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మావోయిస్టు నాయకులు బాలరాజు, నరేంద్రబాబు, కొట్టాల శ్రీరాములు, మనోహర్, బొంతలపల్లి శ్రీరాములు, చలపతి, రామమోహన్, శ్రీనివాసులు, రామాంజనేయులు, అంజినప్ప, కేశవరెడ్డి, పెద్దన్న, రామకృష్ణ, రాయుడు, ధరణి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రం మార్పుపై అపోహలు నమ్మొద్దు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రం మార్పు పై వస్తున్న వదంతులను నమ్మవద్దని ఇది కొందరు నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారమేనని సత్యసాయి జిల్లా వాల్మీకి సాధికారిక కమిటీ జిల్లా అధ్యక్షులు, పుట్టపర్తి పట్టణ టిడిపి కన్వీనర్ బోయ రామాంజినేయులు వెల్లడించారు. అందరి మనోభావాలను దృష్టిలో ఉంచుకొని అప్పటి ప్రభుత్వంలో పుట్టపర్తి సత్యసాయి జిల్లా కేంద్రంగా ఏర్పాటయిందని తెలిపారు. జిల్లాకేంద్రం హిందూపురానికి తరలిపోతోందని కొన్ని ప్రభుత్వ వ్యతిరేక వర్గాలు ప్రజల్లో అలజడి రేకెత్తిస్తున్నాయని ,ఇది ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు. తెలుగుదేశం పార్టీ ఈ ప్రాంత ప్రజల మనోభావాలను ఎల్లప్పుడూ గౌరవిస్తుందని చెప్పారు.

పాఠశాలకు వాటర్ ప్లాంట్ వితరణ

హిందూపురం : పట్టణంలోని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు మునిసిపల్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలకు స్థానిక ఐడిబిఐ బ్యాంకు ఆధ్వర్యంలో శుద్ధ జల ప్లాంట్‌ను బుధవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు అధికారులు మాట్లాడుతూ సిఎస్ఆర్ నిధులలో భాగంగా 350 మంది విద్యార్థులకు పరిశుద్ధమైన రక్షిత మంచినీటిని అందించాలన్న ఉద్దేశంతో 300 లీటర్ల సామర్థ్యం ప్లాంటును, ఫర్నిచర్ ను పాఠశాలకు అందించినట్లు తెలిపారు. అందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెన్నోబులం, ఐడిబిఐ బ్యాంక్ అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి రాజేష్ కుమార్, హిందూపురం బ్రాంచ్ ఇన్‌ఛార్జి బి.మహేష్, ఫీల్డ్ ఆఫీసర్ నాగరాజు, సీనియర్ ఉపాధ్యాయులు సిద్ధగిరి శ్రీనివాస్, రామాంజనేయులు, నాగప్ప, బాలకృష్ణ పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - తనకల్లు

మండల పరిధిలోని గుర్రంబైలు గ్రామంలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం సాయంత్రం గ్రామానికి చెందిన జి. నాగరాజు (39 తన ఇంటి వెనుక ఉన్న టమోటా తోటలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసైన నాగరాజు ఇంట్లో ఎవరు లేని సమయంలో టమోటా తోటలోని టేకు చెట్టుకు డ్రిప్పు పైప్‌తో ఉరివేసుకొని మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువు మండలంలో సర్వ శిక్షణ అభియాన్ కింద సిఆర్ఎంటిగా పనిచేస్తున్న బాబావలి ఇటీవలే గుండెపోటుతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో సత్యసాయి భక్తురాలైన సుందరవల్లి, సహచర్ల సహకారంతో 18 వేల రూపాయలను డీఈవో కిష్టప్ప చేతుల మీదుగా మృతుని కుటుంబసభ్యులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్వ శిక్ష అభియాన్ పీడీ దేవరాజు, సూపరింటెండెంట్ బలరాముడు, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, హెచ్ఎం శ్రీకాంత్, జయరాం, భాస్కర్ ,బాబు, చంద్ర, మాధవ ,గంగాధర్ ,చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనుమానిత వ్యక్తుల సమాచారం తెలపండి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణం, రూరల్ ప్రాంతాలలో పాకిస్తాన్ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నట్లు లేదా ఉగ్రవాదానికి ప్రేరేపించే వ్యక్తులు ఎక్కడైనా అనుమానితులుగా కనిపిస్తే వెంటనే ధర్మవరం పట్టణంలోని వన్ టౌన్, టూ టౌన్, రూరల్ పోలీసులకు సమాచారం అందించాలని డీఎస్పీ హేమంత్ కుమార్ కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఉగ్రవాదుల సమాచారం తెలిపిన వారికి పోలీస్ శాఖ తరపున రివార్డులు అందజేస్తామని చెప్పారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - చిలమత్తూరు

వినాయక చవితి సందర్భంగా మండలంలో గణేష్ విగ్రహాల ఏర్పాటుకు, ఉత్సవాల నిర్వహణకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని ఎస్ఐ మునీర్ అహ్మద్ స్పష్టం చేశారు. ఈనెల 27న జరగబోయే పండుగ దృష్ట్యా ముందస్తుగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. విగ్రహాల ఏర్పాటు కమిటీగా కనీసం ఐదుగురు ఏర్పడి, వారి గుర్తింపు కార్డులను సమర్పించాలన్నారు. మండపాలు ఏర్పాటు చేసే వారు ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రాత్రి పది గంటల తర్వాత మైకులు ఆఫ్ చేయాలని తెలిపారు. నిమజ్జనం రోజున డీజేలను పూర్తిగా నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు. మూడు రోజులకు మించి అనుమతులు ఇవ్వబోమని ఎస్ఐ చెప్పారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - నల్లమాడ

స్వచ్ఛభారత్ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని సిపిఎం మండల నాయకులు గోవింద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు స్వచ్ఛభారత్ కార్మికులు స్థానిక గ్రామ సచివాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా గోవింద్ మాట్లాడుతూ కార్మికులకు నాలుగు నెలల నుంచి వేతనాలు ఇవ్వలేదన్నారు. వేతనాలు ఇవ్వకపోతే వారి కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. ఇప్పటికైనా వారికి బకాయి వేతనాలు ఇవ్వాలని, యూనిఫాం, పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గ్రామ సచివాలయ అధికారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు నరసింహులు, గంగాద్రి, శ్రీరాములు, శ్రీనివాసులు, నారాయణమ్మ, చెన్నమ్మ, నాగలక్ష్మి, గంగాదేవి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు

మధ్యంతర భృతి ప్రకటించాలి

ప్రజాశక్తి - రొద్దం

ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను చెల్లించి మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ బుధవారం డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన పెద్దమంతూరు ,రొద్దం ,కలిపి ,రొప్పాల చోలేమర్రి ,నల్లూరు తదితర పాఠశాలలను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూల్యాంకన విధానాన్ని సరళతరం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ రొద్దం ఎస్ టి యు నాయకులు సత్యనారాయణ రెడ్డి ,విష్ణు ప్రధానోపాధ్యాయులు ముజఫర్ హుస్సేన్ ,లక్ష్మీనారాయణమ్మ, ఉపాధ్యాయులు రమణారెడ్డి, ,రామచంద్రారెడ్డి, నగేష్, తిప్పేస్వామి, రాయుడు, నారపరెడ్డి, సునీల, ప్రభాకర్ ,నాగేంద్ర, శివశంకర్, రామాంజనేయులు ,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స.హ. చట్టంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-హిందూపురం

డివిజనల్ సహకార అధికారి ఆధ్వర్యంలో బుధవారం అధికారులు, సిబ్బంది సమాచారం హక్కు చట్టం పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సహకార అధికారి ఆర్ కృష్ణా నాయక్ పాల్గొని మాట్లాడారు. సమాచార హక్కు చట్టం ప్రజల చేతుల్లోని బ్రహ్మాస్త్రం లాంటిది అన్నారు. దీనిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని రహస్యాలు లేని సమాజాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఐఒ రాగ సుధా, కార్యాలయ సూపరింటెంటెంట్ మహేష్ కుమార్, శ్రీరాములు, పద్మ, అనుపమా, చెన్నకేశవులు, అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వెంకటరెడ్డి సీనియర్ ఇన్స్పెక్టర్ అమర్నాథ్, సహకార సంఘాల సీఈఓ లు రామకృష్ణారెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే చర్యలు

ప్రజాశక్తి - మడకశిర టౌన్

మడకశిర నగర పంచాయతీలో ప్లాస్టిక్ కవర్లను విక్రయించినా, వినియోగించిన చర్యలు తప్పవని నగర పంచాయతీ కమిషనర్ జగన్నాథం హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం పట్టణంలోని కూరగాయల మార్కెట్, పూల వ్యాపారం మార్కెట్, హోటళ్లను తనిఖీ చేశారు. పలువురు నిషేధించిన ప్లాస్టిక్ వస్తువులను వినియోగించడంపై అపరాధ రుసుం విధించారు. మడకశిరను ప్లాస్టిక్ రహిత నగర పంచాయతీగా తీర్చి దిద్దడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిరుద్యోగ యువతీ యువకులకు మూడు నెలల పాటు ఉచితంగా బ్యూటీషియన్, కంప్యూటర్ కోర్సులలో శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి హరికష్ణ బుధవారం తెలిపారు. 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల మధ్య ఉన్న యువతి యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తి అయిన అనంతరం సర్టిఫికెట్ తో పాటు ఉపాధి కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు స్కిన్ హబ్ కోఆర్డినేటర్ శివప్రసాద్ 9676706976 నెంబర్ లో సంప్రదించాలని తెలిపారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డిఎల్‌డిఒ వెంకటరత్నం హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎంపిడివో కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది పనితీరులో మార్పు కనబడలేదని అసహనం వ్యక్తం చేశారు. పలుమార్లు పలు సూచనలు చేశామన్నారు, ఇప్పటికి ఇద్దరిలో మార్పు కనపడలేదని వారిని త్వరలోనే కలెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం జరిగే రీసర్వే కార్యక్రమంలో అధికారులు తమ పని తీరు మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడివో మాధవరెడ్డి, సిబ్బంది సురేష్, జక్కావలి, పంచాయతీ కార్యదర్శులు, విఆర్వోలు, ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒను సత్కరిస్తున్న సిబ్బంది

అవార్డు గ్రహీతకు సత్కారం

ప్రజాశక్తి-పామిడి

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అనంతపురంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన పంద్రాగస్టు వేడుకల్లో ఎంపిడిఒ తేజోష్ణ, వంకరాజుకాలువ సచివాలయ ఆధార్ డిజిటల్ అసిస్టెంట్ షబ్బీర్, పాల్యం ఫీల్డ్ అసిస్టెంట్ శివశంకర్‌నాయుడు మంత్రి పయ్యావుల కేశవ్, ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ నుంచి జిల్లాస్థాయిలో ఉత్తమ అవార్డులు అందుకున్నారు. దీంతో బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వారిని కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు

టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో బుధవారం టౌన్ వెండింగ్ కమిటీ ఛైర్మన్ అయిన కమిషనర్ బాలస్వామి అధ్యక్షతన టౌన్ వెండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో స్ట్రీట్ వెండర్ సర్వే, ఆన్‌లైన్ నమోదు, స్ట్రీట్ వెండర్ గుర్తింపు కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్‌పై కమిటీ సభ్యులతో చర్చించారు. కమిషనర్ మాట్లాడుతూ స్ట్రీట్ వెండర్ సర్వేలో నమోదు, స్ట్రీట్ వెండర్ గుర్తింపు కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్‌లు పూర్తి చేయాలని ఆదేశించారు. టౌన్ వెండింగ్ జోన్లలో మార్పులు, స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌పై చర్చించారు. సమావేశంలో హెల్త్ ఆఫీసర్ రంగస్వామి, టిపిఎస్ మంజుల, టెక్నికల్ ఎక్స్‌పర్ట్ భవాని, సిఎంఎం పి.కాటమయ్య, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, టౌన్ వెండింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డిఎంఎ

నగరంలో నిర్మాణాలపై డిఎంఎ ఆరా

టౌన్ ప్లానింగ్ అధికారులపై ఆగ్రహం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

'నగర పరిధిలో ఎక్కడ చూసినా నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి.. ప్రతి నెలా ఏఏ సచివాలయం నుంచి ఎన్ని దరఖాస్తులు వస్తున్నాయి' అని డిఎంఎ సంపత్‌కుమార్ ప్రశ్నించారు. దీనిపై టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శిరీష, టిపిఎస్ మంజుల సమాధానమిస్తూ 40 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. దీంతో డిఎంఎ ఆగ్రహం వ్యక్తం చేస్తూ నగరంలో జరుగుతున్న నిర్మాణాలను పరిశీలిస్తే మీరు చెబుతున్న లెక్కలకు పొంతనలేదని పేర్కొన్నారు. అలాగే నక్ష ప్రోగ్రాం పనితీరులో సైతం చాలా వెనుకబడి ఉన్నారని హెచ్చరించారు. అంతకుముందు కమిషనర్ బాలస్వామి డిఎంఎకు టౌన్ ప్లానింగ్ సిబ్బందిని పరిచయం చేశారు. దీంతో ఆయన వారిపై ప్రశ్నల వర్షం కురిపించారు.

అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎస్ఆర్ఐటిలో విద్యార్థులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-శింగనమల

విద్యార్థి ఆరంభ కార్యక్రమం(స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం)లో భాగంగా బుధవారం మండలంలోని రోటరీపురం గ్రామం వద్ద ఉన్న ఎస్ఆర్ఐటి కళాశాలలో హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యోగా, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్, ఎన్ఎస్ఎస్, యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్‌పై అవగాహన కల్పించారు. నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, సృజనాత్మకత, నాయకత్వం, క్రమశిక్షణ, యాంటీ-ర్యాగింగ్ కమిటీలు, తదితర అంశాలను వివరించారు.

మాజీ మంత్రికి ఆలూరు సాంబశివారెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-శింగనమల

వైసిపి మాజీ మంత్రి కురసాల కన్నబాబుని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి బుధవారం వ్యక్తిగతంగా కలిసి పరామర్శించారు. కన్నబాబు తండ్రి కురసాల సత్యనారాయణ మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సత్యనారాయణ గతంలో కాకినాడ రూరల్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా పని చేసి ప్రజలకు విశేషమైన సేవలు అందించారని కొనియడారు. ఆయనతో పాటు పెద్దాపురం, రామచంద్రాపుర నియోజకవర్గాల సమన్వయకర్తలు దొరబాబు, పిల్లి సూర్యప్రకాశ్ ఉన్నారు.

కన్నబాబుతో మాట్లాడుతున్న ఆలూరు

డెంగీ, మలేరియాపై అవగాహన ర్యాలీ

గాండ్లపెంటలో ర్యాలీ

హిందూపురంలో ర్యాలీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

దోమలు ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకై ప్రజలందరూ ఉమ్మడి భాగస్వామ్యంతో ఉద్యమించాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ తిపేంద్ర నాయక్ తెలిపారు. ప్రపంచ దోమల దినోత్సవం పురస్కరించుకొని వైద్యులు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆసుపత్రి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా తిపేంద్ర నాయక్ మాట్లాడుతూ వారం పైబడిన నీటి నిల్వలు తొలగించాలని దోమల పెరుగుదలను నివారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు హరి, శ్రీనివాసులు, సురేష్ నాయక్, సబ్ యూనిట్ మలేరియా ఆఫీసర్ జయరాం నాయక్, ఆరోగ్య కార్యకర్తలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండల పరిధిలోని కటారుపల్లి క్రాస్ వద్ద ఉన్న కేజీబివిలో బుధవారం దోమల నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య అధికారి మహేశ్వరి, మారుతి అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ విజయ్ కుమార్, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి :ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి విద్యార్థులతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టరు హరిత, గోవర్ధన్ నాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ రాంకుమార్, హెల్త్ అసిస్టెంట్లు జానకిరామ్, హర్షవర్ధన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ హోమియోపతి వైద్యురాలు అర్చన పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో దోమల ద్వారా వ్యాపించే టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా లాంటి విష జ్వరాలు బారిన పడకుండా ఉండడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వ్యక్తిగత పరిశుభ్రత, ఇంటి పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు బషోబి బేగం, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హిందూపురం : దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకై ఉమ్మడి భాగస్వామ్యంతో ఉద్యమిద్దామని మలేరియా సబ్‌యూనిట్ అధికారి శివన్న పిలుపునిచ్చారు. ప్రపంచ దోమల దినోత్సవం పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు సంయుక్తంగా అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులతో పాటు వైద్య ఆరోగ్య సిబ్బంది రాఘవేంద్ర నాయుడు, పిడిఎస్ ప్రసాద్, గోవిందరాజులు, ముస్తఫా, శీను, సురేష్, సాయి ప్రసాద్, శేషు, నాగరాజు, జగదీష్, తిమ్మక్క, ఎర్రమ్మ, సౌభాగ్య, జయశీల, విజయ కుమారి తో పాటు ఆశ ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రి ప్రాంగణం దాటని ర్యాలీ

ప్రజాశక్తి-నంబులపూలకుంట

ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా చేసిన మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన ర్యాలీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికే పరిమితం కావటంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున దోమలు అధికమై సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి వుంది. ఇటువంటి సమయంలో వైద్య సిబ్బంది గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి. కాని ప్రస్తుత వైద్య సిబ్బంది ఏమైనా కార్యక్రమాలు నిర్వహిస్తే ఫోటోలకు ఫోజులు ఇవ్వడం తప్ప క్షేత్రస్థాయిలో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

పరిశ్రమ ఏర్పాటులో 'ఉద్యమ్' పత్రం కీలకం

ప్రజాశక్తి - కదిరి టౌన్

వ్యాపార, పరిశ్రమల స్థాపనలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పత్రం చాలా కీలకమైనదని పరిశ్రమల శాఖ అధికారులు పేర్కొన్నారు. ఉద్యమ్ రిజిస్ట్రేషన్, పరిశ్రమల ఏర్పాటుపై బుధవారం స్థానిక ఖాద్రీ మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆర్డీవో కార్యాలయ ఏఓ రవికుమార్, పరిశ్రమల శాఖ విస్తరణ అధికారులు సంజీవరాజు, దుర్గేష్, ఓబులేసు పాల్గొని మాట్లాడారు. ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పత్రం ఔత్సాహిక, వ్యాపార, పారిశ్రామికవేత్తలకు చాలా ఉపయోగకరమైనదన్నారు. వ్యాపార, పరిశ్రమల స్థాపన లో ఉద్యమ్ ఆధారంగానే బ్యాంకులు రుణాలు, పరిశ్రమల శాఖ నుండి వచ్చే సబ్సిడీలు లభ్యమౌతాయన్నారు. ఔత్సాహిక వ్యాపార, పారిశ్రామికవేత్తలు ప్రభుత్వం నుంచి వచ్చే అనేక ప్రయోజనాలు పొందవచ్చున్నారు. సరైన అవగాహన లేక దళారులను నమ్మి వేల రూపాయలు నష్టపోతున్నారన్నారు. చాలా సులభతరమైన ఉద్యమ్ రిజిస్ట్రేషన్ కోసం ఔత్సాహికుల ప్రయోజనం కోసం ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసిందన్నారు. కదిరిలో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో సుమారు 150 మంది హాజరవగా 45 మందికి అక్కడికక్కడే ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ప్రజలు దూరంగా ఉండాలని శ్రీ సత్య సాయి జిల్లా పోలీసులు సూచించారు. జిల్లా ఎస్పీ వి రత్న ఉత్తర్వుల మేరకు పుట్టపర్తి డీఎస్పీ విజయ్ కుమార్ పర్యవేక్షణలో పుట్టపర్తి రూరల్ సిఐ సురేష్, ఎస్ ఐ లు లింగన్న, కృష్ణమూర్తి , సిబ్బంది కలిసి పుట్టపర్తి రూరల్ పరిధిలోని గంగిరెడ్డిపల్లి గ్రామంలో బుధవారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తుల ఇళ్ళల్లో తనిఖీలు నిర్వహించారు. ఎక్కడైనా ఎవరైనా గొడవలు, దౌర్జన్యాలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కొత్త వ్యక్తులు ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాల్సిన భాధ్యత ప్రజల పై ఉందన్నారు. ఎవరైనా గంజాయి, మద్యం అక్రమ విక్రయం వంటివి చేసినా, గొడవలు పడినా పోలీసులకు దృష్టి కి తీసుకురావాలన్నారు.

ఎట్టకేలకు డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పూర్తి చేసుకుని డిగ్రీ అడ్మిషన్లు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులకు మూడు మాసాల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలు విడుదలైన తరువాత 3 మాసాల నుంచి వేలాది మంది విద్యార్థులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిగ్రీలో అడ్మిషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం బుధవారం నుంచి ఇంటర్ విద్యార్థులు డిగ్రీ అడ్మిషన్ల కోసం ఆన్ లైన్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని ఈనెల 26వ తేదీ వరకు గడువు ఇస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. డిగ్రీ కి సంబంధించి కేవలం పది రోజుల్లో ప్రక్రియను పూర్తి చేసే విధంగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చర్యలు ం చేపట్టింది. ఈ విషయంపై బుధవారం ఎన్ ఎస్ పి ఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి మాట్లాడుతూ 2025 26 విద్యా సంవత్సరానికి బీఏ బీఎస్సీ బీకాం కోర్సులలో ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం విద్యార్థులు రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులకు ఈనెల 24వ తేదీ నుంచి 28 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు అన్నారు. రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులకు ఈనెల 31వ తేదీన సీట్ల కేటాయింపు వివరాలు తెలుస్తాయన్నారు.

పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి-హిందూపురం

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో హిందూపురం రూరల్ మండలపరిధిలోని బలంపల్లి చలివెందల గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి సురేంద్ర నాయక్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కృష్ణయ్య తో పాటు వ్యవసాయ పరిశోధన కేంద్రం, వ్యవసాయ శాస్త్రవేత్త భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎండు తెగుళ్లు, కత్తెర పురుగు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి రైతులకు వివరించారు. అదేవిధంగా కలుపు నివారణ గురించి రైతులకు సూచించారు. ప్రధాన శాస్త్రవేత్త ఆచారి మాట్లాడుతూ భూసార పరీక్ష ఫలితాల అనుగుణంగా ఎరువుల వాడకం గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది సురేష్, గౌతమి, రవీంద్ర, రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై నేడు నిరసన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

అంగన్‌వాడీల సమస్యలపై గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టాలని అంగన్‌వాడీ వర్కర్స్, జిల్లా యూనియన్ అధ్యక్షురాలు శకుంతల బుధవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. వేతనాల పెంపు, సమ్మె కాలపు వేతనాలు, ఎఫ్ఆర్ఎస్ రద్దు, ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపు, గ్రాట్యుటీ జీవో మార్పు, అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా మార్చాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

23న పివికెకెలో ప్రాంగణ నియామకాలు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న పివికెకె డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 23వ తేదీ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్లేస్‌మెంట్ డీన్ డా. సి.భానుకిరణ్, ప్రిన్సిపల్ డా. రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు. బీఎస్సీ, బిసిఎ కోర్సుల్లో(2022-25) ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులన్నారు. ఆన్‌లైన్ పరీక్ష, ముఖాముఖి ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తారన్నారు. ఉద్యోగం చెన్నైలో చేయాల్సి ఉంటుందని, ఏడాదికి రూ. 3 లక్షల వేతనం, భోజనం, రవాణా సౌకర్యం కల్పిస్తారన్నారు.

పింఛన్లు పునరుద్ధరించాలని రేపు ధర్నా

ప్రజాశక్తి-రాప్తాడు

మండలంలో అర్హులందరికీ షరతులు లేకుండా వికలాంగుల పింఛను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22వ తేదీ సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద చేపట్ట నున్న ధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాప్తాడు రూరల్ ప్రాంతీయ కార్యదర్శి టి.రామాంజనే యులు పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 680 మంది వికలాంగులకు నోటీసులు ఇవ్వడం బాధాకరమన్నారు. పింఛన్ల అంశంపై సిపిఎం ఆధ్వర్యంలో చెర్లోపల్లి గ్రామంలో ప్రత్యక్షంగా పరిశీలించామన్నారు. మంచానికి పరిమితమైన వారికి రూ. 15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ కమిటీ సభ్యులు పోతలయ్య, మల్లేష్, సుబ్బారావు, ప్రతాప్, మధు, లక్ష్మన్న పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలంలోని తోపుదుర్తి గ్రామంలో బుధవారం రైతు సేవా కేంద్రం ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.పద్మలత ఆధ్వర్యంలో రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో వాతావరణ ఆధారిత వ్యవసాయం, ప్రకృతి వ్యవసాయం, నానో యూరియా, నానో డిఏపి వాడటం వల్ల కలిగే లాభాలు, జీవన ఎరువులు వాడటంలో మెలకువలు, భూసార పరీక్షలు, ఆ ఫలితాల ద్వారా ఎరువుల యాజమాన్యం, వివిధ పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎఇఒలు అలేఖ్య, అక్కమ్మ, రైతు సేవా కేంద్ర సిబ్బంది నరసింహులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఖాజీగా మౌలానా అల్హాజ్

ప్రభుత్వ ఖాజీగా నియామక పత్రం అందుకుంటున్న రెహమాన్ సాహెబ్

ప్రజాశక్తి-పామిడి

పట్టణ ప్రభుత్వ ఖాజీగా మౌలానా అల్హాజ్ ఫజ్లూర్ రెహ్మాన్ సాహెబ్ ఎంపికయ్యారు. ఆయన మాట్లాడుతూ తనను ఖాజీగా ఎంపిక చేసిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, గుమ్మనూరు ఈశ్వర్, కలెక్టర్ వినోద్ కుమార్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాకు అప్పజెప్పిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని, ఇచ్చిన పరిధిని అతిక్రమించకుండా సేవలు అందిస్తానని తెలిపారు. అందుకు పట్టణంలోని ముస్లింలందరూ సహకరించాలని కోరారు.

ప్రపంచ దోమల దినోత్సవంపై అవగాహన

ప్రజాశక్తి-యాడికి

స్థానిక నెంబర్-1 పాఠశాలలో బుధవారం డాక్టర్ సాయిసుమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రపంచ దోమల దినోత్సవంపై అవగాహన కల్పించారు. దోమల వల్ల వచ్చే మలేరియా డెంగీ, మెదడువాపు, చికెన్ గున్యా, బోధకాలు, తదితర వ్యాధులు, టీటీ వ్యాక్సినేషన్ గురించి వివరించారు. అలాగే ఈ నెల 12వ తేదీ పాఠశాలకు హాజరు కాని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అనంతరం ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, హెచ్ఎం కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, హెల్త్ అసిస్టెంట్ మద్దిలేటి, ఎఎన్ఎం స్వర్ణలత, ఎంఎల్‌హెచ్‌పి శ్వేతామాధురి, ఆశా కార్యకర్తలు వరలక్ష్మి , మహబూబ్‌బి, సుజాత పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి : సిఐ

ప్రజాశక్తి-శింగనమల

వినాయక చవితి ఉత్సవాలకు తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌లో అనుమతి పొందాలని సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల నిర్వహణకు ఎక్కడా ఎలాంటి చలానా కట్టాల్సిన అవసరం లేదన్నారు. పోలీసుల అనుమతి మాత్రం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఉత్సవాలు మూడు రోజులు మాత్రమే జరుపుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిమజ్జన ఊరేగింపులో అవాంఛనీయ సంఘటనలు జరిగితే బాధ్యులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

విలేకరులతో మాట్లాడుతున్న సిఐ కౌలుట్లయ్య

మాదకద్రవ్యాల వాడకంతో అనర్థం

ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డా॥ఎన్‌వి.ప్రసాద్

డ్రగ్స్ నియంత్రణ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యం, సిబ్బంది

ప్రజాశక్తి-అనంతపురం

మాదకద్రవ్యాల వాడకం సామాజిక, మానసిక శారీరక సమస్యలకు దారితీస్తుందని అనంతపురం ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వి.ప్రసాద్ తెలియజేశారు. ఎస్‌వి డిగ్రీ, పీజీ కళాశాలలో నషా ముక్త భారత్ అభియాన్ ప్రోగ్రామ్ లో భాగంగా డ్రగ్స్ అలవాట్లకు వ్యతిరేకంగా సామూహిక ప్రమాణం తీసుకునే కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల వైస్ ఛైర్మన్ సి.చక్రధర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు గుట్కా, సిగరెట్, తంబాకు, గంజాయి వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. వీటి వాడకం వల్ల జీవితాలు నాశనం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఈగల్ సెల్ ఇన్‌ఛార్జి సబ్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి.హనుమంతు, ఆర్ట్స్ కాలేజీ లెక్చరర్ బ్రుందా, డిసేబుల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారి అనిల్ కుమార్, జాతీయసేవా పతకం పీవో జి.ఆనంద్ బాబు, టి.సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

రైతుల యూరియా కష్టాలు ప్రభుత్వానికి పట్టవా : వైసిపి

ప్రజాశక్తి-కుందుర్పి

మండల వ్యాప్తంగా యూరియా కోసం రైతులు పడుతున్న కష్టాలు ప్రభుత్వానికి పట్టవా అని వైసిపి మండల కన్వీనర్ హనుమంతరాయుడు ప్రశ్నించారు. రైతులకు తక్షణమే తగినంత యూరియా అందించాలని కోరుతూ బుధవారం ఆయన రైతులతో కలిసి మండల వ్యవసాయ అధికారి విజయ కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులు వరి, వేరుశనగ, కంది, పత్తి, మిరప, టమోటా, మొక్కజొన్న, తదితర పంటలు సాగు చేశారన్నారు. రైతుకు 2 బస్తాలు చొప్పున మండల వ్యాప్తంగా సుమారు వంద మెట్రిక్ టన్నుల యూరియా అవసరమన్నారు. అయితే ప్రభుత్వం ఆ మేరకు రైతులకు యూరియా అందించ డంలో విఫలమైందన్నారు. ఏవో మాట్లాడుతూ మండలానికి వచ్చిన వెంటనే సబ్సిడీ విత్తనాలు, ఎరువులు రైతులకు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి మారుతీశ్వర రామ్మూర్తి, నాయకులు మంజునాథ, నరేష్, హనుమేష్, రాజగోపాల్, మల్లి, ఆంజి, దాసరి క్రిష్టప్ప, శివశంకర్, వన్నూరప్ప, తిమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారులకు వినతి పత్రం ఇస్తున్న వైసిపి నాయకులు

నానో డిఎపి వాడకంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-నార్పల

మండలంలోని కేశేపల్లి గ్రామంలో బుధవారం రైతులకు నానో యూరియా, నానో డిఎపి వాడ కంపై ఇఫ్కో ఎరువుల కంపెనీ వారితో కలిసి ఏవో చెన్నవీరస్వామి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. నానో యూరియా, డిఎపి పిచికారి చేయడం వల్ల భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు, అతి తక్కువ ఖర్చుతో పంటల్లో ఎక్కువ దిగుబడి తీసుకురావచ్చు అన్నారు. నేల సారాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సరైన సమయంలో మొక్కకు పోషకాలు అందించవచ్చు అన్నారు. పర్యావరణ కాలుష్యం కూడా తగ్గించవచ్చు అన్నారు. రైతు వెంకటరామిరెడ్డి పొలంలో వరి పంటలో నానో డిఎపి ఎరువును పిచికారి చేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇఫ్కో కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ మణికళ్యాణ్, ఎఇఒ ప్రసాద్, గ్రామ వ్యవసాయ అధికారి పోతులయ్య, రైతులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఇఫ్కో ఎరువుల ప్రతినిధులు

యూరియా పంపిణీ పరిశీలన

రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ బ్రహ్మయ్య

ప్రజాశక్తి-కణేకల్లు

మండలంలోని బ్రహ్మసముద్రం, బెనికల్ గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో జరుగుతున్న యూరియా పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం తహశీల్దార్ బ్రహ్మయ్య, మండల వ్యవసాయ అధికారి జగదీష్ పరిశీలించారు. వారు యూరియా నిల్వలు, రైతులకు ఏ విధంగా పంపిణీ చేస్తున్నారనే విషయాలపై అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతులతో మాట్లాడుతూ యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి రైతుకు అందజేస్తామని భరోసా ఇచ్చారు.

పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరం

ప్రజాశక్తి-శింగనమల

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని మండలంలోని తరిమెల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ శంకర్‌నాయక్ తెలిపారు. మండలంలోని నాగులగుడ్డం, తండా, వెస్ట్ నరసాపురం, చిన్నజలాలపురం గ్రామాల్లో బుధవారం వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్న రోగులకు చికిత్స చేయడంతో పాటు ఇంటింటి సర్వే నిర్వహించారు. కీటక జనిత వ్యాధులైన డెంగీ, మలేరియాపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో జ్వరంతో ఉన్న ఆరుగురి రక్త పూతలు సేకరించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు చంద్రశేఖరరెడ్డి , సిబ్బంది గీత, రమణయ్య, ఆంజనేయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.